జగనే మళ్లీ సీఎం.. ఇది ప్రజల ఆకాంక్ష

- ఎమ్మెల్యే ఎలీజా
- మైసన్నగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం


మైసన్నగూడెంలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : సంక్షేమ పథకాల లబ్ధితో ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని, ఈ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గృహాలు మంజూరు కాని అనేక మందికి ప్రస్తుత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రజల వద్దకే సంక్షేమ పాలనను తీసుకురావడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో పెన్షన్ నగదు పొందాలంటే దూర ప్రాంతంలో ఉన్న కార్యాలయాల వద్దకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో 1వ తేదీన ఇంటి వద్దకే వలంటీర్ ద్వారా పెన్షన్లు అందించడం జరుగుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళ్లుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సర్పంచ్ సింగుదాసు హైమావతి, ఉప సర్పంచ్ పిల్లి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడమటి గిరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, పార్టీ నాయకులు వినోద్, జుజ్జూరి సత్యనారాయణ, వల్లూరి శ్రీకాంత్, కోట వెంకటేశ్వరరావు, నేకూరి కిషోర్, మల్నీడి బాబి, నిట్టా బాలయ్య, పాడుదోలు రమేష్, చీమల మురళీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆయిల్‌పామ్ కార్మికునికి ఇన్సూరెన్స్ చెక్ అందజేత


ఆయిల్‌పామ్ కార్మికునికి ఇన్సూరెన్స్ చెక్కును అందచేస్తున్న దృశ్యం

చింతలపూడి : ప్రమాదవశాత్తూ తీవ్రంగా గాయపడిన ఆయిల్‌పామ్ కార్మికునికి సీతానగరం గోద్రేజ్ ఆయిల్‌పాం ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.5 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును గురువారం అందజేశారు. మండలంలోని రేచర్ల గ్రామానికి చెందిన జరబలా సర్వేశ్వరరావు ఆయిల్‌పామ్ గెలలు నరకడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ గాయపడి నడవలేని పరిస్థితుల్లో ఉన్నాడు. ఫ్యాక్టరీ తరపున సర్వేశ్వరరావుకు చేసిన ఇన్సూరెన్స్ మంజూరు అవ్వడంతో సీఈఓ సౌగత్ నియోగి ఆదేశాల మేరకు డీజీఎం నాగ ప్రవీణ్, స్వీటీలు, సర్పంచ్ శివరామకృష్ణ, మాజీ సర్పంచ్ సుబ్బారావు సమక్షంలో ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు.

24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరు రూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు ఏలూరు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి హాజరౌతారని, సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, కార్యదర్శులు పాల్గొని అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై చర్చిస్తారని పేర్కొన్నారు.

మృతుడు.. చినకొట్టాడ వ్యక్తి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సెంటర్ సమీపంలో బస్‌షెల్టర్‌లో బుధవారం మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ లభించింది. మృతుడి కైకలూరు మండలం చినకొట్టాడ గ్రామానికి చెందిన సైదు మాణిక్యాలరావు (55)గా గురువారం ఏలూరు చేరుకున్న బంధువులు గుర్తించారు. మృతుడు భీమడోలులోని తమ బంధువులను చూసేందుకు వెళ్లే నిమిత్తం ప్రయాణమై అనారోగ్యం కారణంగా ఆశ్రం ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని, బస్‌షెల్టర్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తుండగా ఎండవేడిమితో తీవ్ర అనారోగ్యానికి గురైన మాణిక్యాలరావు మృతిచెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

మాదేపల్లిలో ఎన్‌రోల్ డ్రైవ్


మాదేపల్లిలో ఎన్‌రోల్ డ్రైవ్ చేస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు బడిఈడు పిల్లల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని మాదేపల్లి జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సుంకర వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆమె పువ్వుల ఆంజనేయులు, తదితర ఉపాధ్యాయులతో కలిసి గ్రామాల్లో ఎన్‌రోల్ డ్రైవ్ చేపట్టామని పేర్కొన్నారు. గత మూడురోజుల నుంచి మాదేపల్లిలో ఇంటింటికీ వెళ్లి బడి బయటున్న పిల్లలను తరగతి గదులకు రప్పించి హాజరు శాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. పాఠశాలకు వచ్చిన పిల్లలకు చదువు పట్ల ఆసక్తి పెంచుతున్నామని తెలిపారు. ఎన్‌రోల్ డ్రైవ్ మంచి ఫలితాలు ఇస్తుందని ఆంజనేయులు పేర్కొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రం పంపిణీ


సత్రంపాడు వాకర్స్ ఏర్పాటుచేసిన మజ్జిగ కేంద్రం

ఏలూరు రూరల్: సత్రంపాడులో ఎన్టీఆర్ బొమ్మ వద్ద నాలుగురోడ్ల కూడలిలో గురువారం వాకర్స్ అసోసియేషన్ మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.ఆదినారాయణ, వైస్ ప్రెసిడింగ్ ఎ.శ్రీనివాసరావుతో పాటు కేవీఎస్ చంద్రశేఖర్, బిక్కాజి, బి.వెంకటేశ్వరరావు తదితర సభ్యులు పాదచారులు, ఆటో డ్రైవర్లకు మజ్జిగ అందించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ కేంద్రం ఏర్పాటుచేశామని సభ్యులు తెలిపారు.

వాటర్ ట్యాంకర్ ప్రారంభం

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమలకు తపన ఫౌండేషన్ ద్వారా అందించిన సుమారు రూ.2 లక్షల విలువైన వాటర్ ట్యాంకర్‌ను గురువారం ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జీఎస్‌ఆర్ చౌదరి ప్రారంభించారు. స్థానిక వసంత్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కె.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళకు ఐసీడీఎస్ ఆశ్రయం


మతి స్థిమితం లేని మహిళ, రెస్క్యూ అనంతరం

ఏలూరు (టూటౌన్): మతి స్థిమితం లేని మహిళను స్త్రీ, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులు చేరదీసి ఓఎస్సీలో ఉంచారు. ఐసీడీఎస్ ఆర్‌జేడీ కె.ఉమారాణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ దగ్గరలో మతి స్థిమితం లేని మహిళ సంచరిస్తున్నట్టు ఆర్‌జేడీకి సమాచారం వచ్చింది. ఆర్‌జేడీ ఆదేశాలతో పీడీ ఆఫీస్ నోడల్ అధికారి ఎ.లలిత, డీసీపీయూ సిబ్బంది ఆర్ రాజేష్, డీసీపీఓ సూర్య చక్రవేణి, ఓఎస్సీ సిబ్బంది నిర్మల, శాంత, వేద, రాణి కలిసి మతి స్థిమితం లేని మహిళను రెస్క్యూచేసి ఓఎస్సీకి తీసుకొచ్చారు. మహిళ జట్టు కత్తిరించి, స్నానం చేయించి, బట్టలు మార్చారు. తన పేరు అమల అని ఊరు చీపురుపల్లి, నారాయణ టీచర్ అని మాత్రమే చెబుతోంది. రెస్క్యూ చేసిన మహిళను స్వగ్రామంలోని బంధువుల వద్దకు చేర్చేందుకు కృషి చేస్తున్నారు.

క్రాఫ్ట్ వర్క్‌పై విద్యార్థులకు శిక్షణ


ధర్మాజీగూడెంలో విద్యార్థులు వేసిన బొమ్మలు

కొయ్యలగూడెం : వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు అనేక కళలపై శిక్షణ ఇవ్వడం వలన వారి అభ్యున్నతికి తోడ్పడుతుందని చిలకమర్తి ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రముఖ రంగస్థల నటులు, అనిపెద్ది రాధాకృష్ణ శర్మ మూర్తి పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో 11వ రోజుకు చేరిన వేసవి శిక్షణా తరగతులను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఉదయం 8 గంటల నుంచి దేశ నాయకుల జీవిత చరిత్రలను చదివించడం, కథలు, రచనలు, కవితలు రాయించడం, క్రాఫ్ట్ వర్క్‌లో భాగంగా కలర్ పేపర్‌తో డిజైన్ జెండా కటింగ్, ఫ్లవర్ తయారీ శిక్షణపై విద్యార్థులు తాము తయారుచేసిన కళాత్మక చిత్రపటాలను ప్రదర్శించారు. వేసవి శిక్షణా తరగతుల ముగింపు రోజున విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ యు.రాముడు తెలిపారు.

లింగపాలెం : విజ్ఞాన శిబిరంలో భాగంగా ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అంతేకాకుండా నీతి కథలు, చందమామ బాలమిత్రల కథల ప్రాముఖ్యత, బొమ్మరిల్లు కథలు చదివించడం, రాయించడం చేయించారు. విద్యార్థులచే రంగు రంగుల కాగితాలతో బొమ్మలు తయారు చేయించినట్లు ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయాధికారిణి వి.రమణ తెలిపారు.


కొయ్యలగూడెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థుల ప్రదర్శన

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు ఇంగ్లిష్ రైమ్స్ పఠనం, మ్యూజికల్ చైర్ ఆటల పోటీని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప మాట్లాడుతూ విద్యార్థులు ఈ వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని, విజ్ఞానం, వినోదాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

21 నుంచి గంగానమ్మ జాతర


శ్రీ గంగానమ్మ తల్లి

కొయ్యలగూడెం : పొంగుటూరులో గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారికి ఈనెల 21 నుంచి జూన్ 4 వరకు జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పక్షం రోజులపాటు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు ఉత్సవ, ఊరేగింపుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల అనంతరం అమ్మవారికి జాతర నిర్వహిస్తుండడంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ నేపథ్యంలో జూన్ 3వ తేదీ రాత్రి ఆఘం(బలిచేట ప్రదక్షిణలు) మరుసటి రోజు ఆదివారం గ్రామస్తులు సామూహికంగా బంధుమిత్రులకు అమ్మవారి నైవేద్య ప్రసాదాలను విందుగా అందించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు మెయిన్ రోడ్డుకి ఇరువైపులా విద్యుత్ దీపాలంకరణ పనులు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి.

ఏఐటీయూసీ నూతన కార్యవర్గం ఎంపిక



అధ్యక్ష, కార్యదర్శులుగా పి.బాలకృష్ణ, కుంచె వసంత రావు

జంగారెడ్డిగూడెం : ఏఐటీయూసీ నూతన మండల కమిటీ ఎంపిక సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణరాజు అధ్యక్షతన బుధవారం రాత్రి నిర్వహించారు. అధ్యక్షుడిగా పెడకసగంటి బాలకృష్ణ, కార్యదర్శిగా కుంచె వసంతరావు, ఉపాధ్యక్షుడిగా ఎన్.రామకృష్ణరాజు, సహాయ కార్యదర్శిగా కూనపాముల విఘ్నేష్, కోశాధికారిగా ఎస్‌కే సలీమ్, కమిటీ సభ్యులుగా ముప్పిడి సురేష్, కొత్తూరి శ్రీను, యడ్లపల్లి ప్రసాద్, కోట దయామణి, గంజి కృష్ణవేణి, పసుపర్తి శ్రీనివాసరాజు ఎంపికయ్యారని రమణ రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

చంద్రబాబు అహంకారానికి గొడ్డలి పెట్టు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : సుప్రీం కోర్టు తీర్పు చంద్రబాబు అహంకారానికి గొడ్డలి పెట్టు అని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తే అమరావతి క్యాపిటల్ సమతుల్యత దెబ్బతింటుందంటూ చంద్రబాబు రైతుల ముసుగులో ఆందోళన చేయించారని, దీంతోపాటు కోర్టులకు వెళ్లి మంచి కార్యక్రమాన్ని ఆపేందుకు యతించారని, దీనిని కోర్టులు సైతం వ్యతిరేకిస్తూ, పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీకి ఇబ్బందులు లేకుండా తీర్పు రావడం హర్షణీయమన్నారు. సుప్రీం తీర్పుతో అమరావతిలో 55 వేల మంది పట్టాలు పొందుతారన్నారు. సొంతింటి కలను నిజం చేసుకుంటారని, ఆ కలను సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చంద్రబాబు ఆటలకు చెక్ పడినందుకు సంతోషంగా ఉందని, ఇళ్లస్థలాలు పొందనున్న పేదలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు ఇకనైనా పేదల కోసం పనిచేయాలని హితవు పలికారు.

మలాథియాన్ స్ప్రేయింగ్ చేయించుకోవాలి


మలాథియాన్ స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జ్ ఐటీడీఏ పీవో సత్యనారాయణ

పోలవరం రూరల్ : దోమల నివారణ కోసం ప్రతి ఇంటి లోపల, ఇంటి చుట్టూ మలాథియాన్ స్ప్రేయింగ్ చేయించుకోవాలని ప్రజలకు ఐటీడీఏ ఇన్‌ఛార్జ్ ప్రాజెక్టు అధికారి బీవీవీ సత్యనారాయణ సూచించారు. ఆయన పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చేగొండిపల్లి, మామిడిగొంది గ్రామాల్లో గురువారం నిర్వహించిన మలాథియాన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే ప్రభుత్వం అందించిన దోమ తెరలను అందరూ వినియోగించుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎవరికైనా అనారోగ్యం వస్తే వైద్యారోగ్య శాఖ సిబ్బంది ద్వారా వైద్యశాలకు తరలి వెళ్లి చికిత్స పొందాలన్నారు. ఈయన వెంట ఏపీవో పీవీఎస్ నాయుడు, జిల్లా మలేరియా అధికారి పీఎస్‌ఎస్ ప్రసాద్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి బి.నాగేశ్వరరావు, ఏఎంవో శ్రీనివాస్, ఎంపీహెచ్‌ఈవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


నగరపాలక సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతతో కృషి చేయాలని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ మారుతోన్న జీవన శైలికి అనుగుణంగా కాలుష్యం తీవ్రస్థాయికి చేరిందన్నారు. నీటి, వాయు కాలుష్యాలను తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. భావితరాలకు ఆరోగ్యవంతమైన గాలి, నీరు అందించేందుకు ప్రతి ఒక్కరు తమవంతు పాత్ర పోషించాలని కోరారు. ఈనెల 18 నుంచి 15 రోజుల పాటు పర్యావరణ పరిరక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుతామని నినదిస్తూ నగరపాలక సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్పొరేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఎంఈ భాస్కరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ మాలతీ, నగరపాలక ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

శ్రీనూకాలమ్మకు సౌభాగ్య ద్రవ్యాలతో అభిషేకం



పూజా ద్రవ్యాలను తీసుకువస్తున్న భక్తులు, నూకాలమ్మ అమ్మవారికి పసుపు కుంకుమలు, జలాలతో అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణానికి ఉత్తరాన కొలువైయున్న శ్రీ చక్ర సహిత శ్రీ నూకాలమ్మ అమ్మ వారి ఆలయం నాల్గవ వార్షిక వేడుకల్లో భాగంగా రెండో రోజు గురువారం అమ్మవారు స్వర్ణవర్ణపూర్ణ కవచ అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి మూల విరాట్‌కు మూలమంత్ర కళాహోమం, అష్టోత్తర శత కలశాలతో, సప్తనదీ పుష్కర జలాలతో విశేష సౌభాగ్య ద్రవ్యాలతో 108 మంది స్త్రీ మూర్తులచే అత్యంత వైభవోపేతంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం నిత్యపూజా కైంకర్యాలు, నీరాజన మహా మంత్ర పుష్పం చతుర్వేద స్వస్తి ఆలయ అర్చక స్వాముల బృందం జరిపారు. ఈరోజు అమ్మవారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాద వితరణకు కారింగుల రామకృష్ణమూర్తి, శ్రీరామనాగరత్నం దంపతులు, వారి కుటుంబ సభ్యులు సహకారం అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఆధ్యాత్మిక సేవాప్రతినిధి తిప్పాభట్ల రామక్రిష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఉపాధి హామీ చట్టం

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని, చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. కోట్లాది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెట్టడానికి తెచ్చిన ఉపాధి హామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటో సిస్టం, రెండు పూటల పనిని తీసుకొచ్చిందని ఆరోపించారు. దీంతో ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. ఈ పథకాన్ని ఎత్తివేయడానికి బీజేపీ చేసిన అనేక కుట్రలలో భాగంగా కూలీలకు వేతనాలు, సమ్మర్ అలవెన్స్, మేట్ల పారితోషికం, ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు చేస్తుందని పేర్కొన్నారు. ఈ ఉపాధి హామీ పథకమే 2020 కరోనా సమయంలో పేదలు ఆకలి చావులు సంభవించకుండా కాపాడిందని గుర్తుచేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం బడ్జెట్లో రూ.30 వేల కోట్లు తగ్గించి ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటో సిస్టంను రద్దు చేయాలని, రెండు పూటల పనిని తీసివేయాలని, సమ్మర్ అలవెన్స్, పేస్లిప్, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. పని ప్రదేశాల్లో ఆశ, ఏఎన్ఎంలను నియమించాలన్నారు. కుటుంబానికి 200 రోజులు పనిదినాలు, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని ఆయన కోరారు.

మత రాజకీయాలను ఓడించడమే లక్ష్యం

ఏలూరు (టూటౌన్): దేశంలో మతరాజకీయాలను ఓడించడమే భారత్ బచావో లక్ష్యం అని భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు గుబ్బల నాగేశ్వరరావు అన్నారు. నాగేశ్వరరావు ఇంటి వద్ద గురువారం నిర్వహించిన భారత్ బచావో జిల్లా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దేశంలో మత రాజకీయాలకు వ్యతిరేకంగా ఏ రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా వర్క్ షాపులు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కర్ణాటకలో బీజేపీ ఓటమి వెనుక తమ సంస్థ పాత్ర ఎంతో ఉందన్నారు. ఒక ప్రత్యేక వెబ్ సైట్ ద్వారా కర్ణాటకలో విస్తృత ప్రచారం చేశామని, ఈ వెబ్‌సైట్‌లో 112 సంస్థలు పనిచేశాయని తెలిపారు. ఆరు నెలల పాటు ఐదువేల మంది కార్యకర్తలు 149 నియోజకవర్గాల్లో బీజేపీ మత రాజకీయాలకు వ్యతిరేకంగా పనిచేశాయని గుర్తుచేశారు.

భారత్ బచావో జిల్లా కార్యవర్గం ఎన్నిక

సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా గుబ్బల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కాపుదాసి రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా పాము రవీంద్రనాథ్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా రేవుల గద్ద హరికిరణ్ సింగ్, లీగల్ వ్యవహారాల కార్యదరిశగా గంటా రాజశేఖర్, మీడియా వ్యవహారాల కార్యదర్శిగా నూకపెయ్యి కార్తీక్, ప్రచార కార్యదర్శిగా మానుపాటి వసంత్ కుమార్, వైస్ చైర్మన్-2 గా భూక్యా రమేష్ నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిలుగా నంబూరి రవికుమార్, కాట్రు బసవరాజులతో పాటు ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు కన్వీనర్లను నియమించారు.

ఉపాధి కూలి రూ.600 ఇవ్వాలి

ఏలూరు రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు కనీస వసతులు కల్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాదేపల్లి శివారు తమ్మిలేరులో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాలతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఫొటో యాప్ విధానం వల్ల నెట్ సౌకర్యం లేని చోట్ల కూలీలు ఫొటోలు అప్‌లోడ్ చేయలేకపోతున్నారని వివరించారు. ఆన్‌లైన్ సమస్య తక్షణం పరిష్కరించాలని కోరారు. కూలీలకు 200 రోజుల పనిదినాలు, రూ.600 కనీస వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు.

మెరుగైన సేవలతో మన్ననలు పొందాలి


టి.నరసాపురం సచివాలయం-2లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో ఎం.రాజు

టి.నరసాపురం: సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలను అందించడం ద్వారా వారి మన్ననలు పొందాలని డీఎల్‌డీవో ఎం.రాజు అన్నారు. మండలంలోని టి.నరసాపురం, ఏపుగుంట, తిరుమలదేవిపేట సచివాలయాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయా సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు పారదర్శకంగా అందించాలని, అర్హులైన లబ్ధిదారులు ఎవరూ సంక్షేమ పథకాలు అందలేదనే మాట ఉండకూడదన్నారు. సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ పి.శేఖర్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : రైతులకు పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నట్లు కేఆర్‌పురం వ్యవసాయ సంచాలకులు పీజీ బుచ్చిబాబు తెలిపారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెం ఆర్‌బీకేలో వ్యవసాయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ 7 గ్రూప్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ గ్రూప్‌లకు సంబంధించి ట్రాక్టర్‌లు, వ్యవసాయ పరికరాల వివరాలను తెలిపారు. ఆర్‌బీకే సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, పాల్గొన్నారు.